

దివ్యవిమాన రథంపై..
యాదాద్రిలోని శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి దివ్యవిమాన రథంపై ఊరేగారు.
- 8లో



వనదేవతలకు మొక్కులు
ఉమ్మడి జిల్లాలోని చిన్న మేడారాల్లో కొలువు దీరిన వనదేవతలకు శుక్రవారం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.
- 8లో



దారితప్పి జనారణ్యంలోకి..
నాగార్జునసాగర్ కోర్ ఏరియాలో అడవిలో వదిలిన జింకలు జనారణ్యంలోకి వచ్చి వీధికుక్కల బారిన పడుతున్నాయి.
- 8లో

న్యూస్‌రీల్

ప్రతి ఇంటికీ తాగునీరందించాలి



అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

సాక్షి ఎఫెక్ట్..

సూర్యాపేట: పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, కమిషనర్ శ్రీనివాస్ సిబ్బందిని ఆదేశించారు. సూర్యాపేటలోని వివిధ వార్డుల్లో నెలకొన్న నీటి సమస్యపై ఇటీవల సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'గొంతెండుతోంది..!' ప్రత్యేక కథనానికి వారు స్పందించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో 48 వార్డులకు చెందిన వాటర్ లైన్‌మెన్లతో సమావేశమయ్యారు. ఏయే వార్డుల్లో నీటి సమస్య ఉందని అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో వార్డుల కౌన్సిలర్ల సమన్వయంతో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో మున్సిపల్ ఈఈ జీడీకే ప్రసాద్, ఏఈ వరుణ్, వాటర్ సెక్షన్ ఇన్‌చార్జి సయ్యద్ సమ్మీ పాల్గొన్నారు.

ఆలయ భూములు అన్యాక్రాంతం కావద్దు



ఆలయాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, అధికారులు

అర్వపల్లి: అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూసుకోవాలని దేవాదాయ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.అనిత సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆమె అర్వపల్లిలో ఆదేవాలయ భూములను పరిశీలించారు. దేవాలయానికి సంబంధించిన భూములు ఎన్ని ఉన్నాయి.. సాగులో ఉన్న భూములెన్ని.. ఇళ్ల నిర్మాణం తదితర విషయాలపై ఆ శాఖ అధికారులతో చర్చించారు. అనంతరం దేవాలయాన్ని సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ తహసీల్దార్ విజయలక్ష్మి, ఈఓలు వై.శ్రీనివాస్‌రెడ్డి, కుశలయ్య, దంతాల శేఖర్, దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ చైర్మన్ బైరబోయిన సైదులు, మహరాజు, ధర్మకర్త రత్నం లక్ష్మాజీ, రాగి అనిల్, చెన్న రమేష్, సతీష్, కోటి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యం

దురాజ్‌పల్లి (సూర్యాపేట): అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ జిల్లా మహాసభల్లో భాగంగా శుక్రవారం రెండో రోజు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో, దేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతామన్నారు. కేంద్రంలో మోదీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులంతా ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎస్‌కే.సయ్యద్ హుస్సేన్, ఉపాధ్యక్షుడిగా కాసర్ల దుర్గయ్య, ప్రధాన కార్యదర్శిగా వీరబోయిన రమేష్, సహాయ కార్యదర్శిగా గోగుల వీరబాబు, కోశాధికారిగా వాజిద్, సభ్యులుగా చిత్తలూరి లింగయ్య, కర్ణాకర్ , సయ్యద్, మంగమ్మ ఎన్నికయ్యారు. వేర్పుల లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.ఎల్.పద్మ, న్యూడెమాక్రసీ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, న్యాయవాది లింగంపల్లి భద్రయ్య, జిల్లా నాయకుడు కారింగుల వెంకన్న, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చింతలపాలెంలో మంత్రుల పర్యటన



నక్కగూడెం ఎత్తిపోతల పథకం

హుజూర్‌నగర్: చింతలపాలెం మండలంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం రానున్నారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి క్యాంపు కార్యాలయ పీఆర్‌ఓ వెంకట్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముగ్గురు మంత్రులు దామరచర్ల మండల పరిధిలోని యాదాద్రి పవర్ ప్లాంట్ వద్ద నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 11.45 గంటలకు మేళ్లచెరువు మైహోమ్ ఫ్యాక్టరీలో గల హెలిపాడ్‌లో దిగుతారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన వచ్చి మధ్యాహ్నం నక్కగూడెం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం దొండపాడు శివారులో ఓ ప్రైవేట్ పరిశ్రమకు శంకుస్థాపన చేస్తారు. జువారీ సిమెంట్ ఫ్యాక్టరీలో మధ్యాహ్న భోజనం అనంతరం మేళ్లచెరువు మండల కేంద్రానికి చేరుకొని అక్కడ నుంచి మధ్యాహ్నం 2.45 గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు వెళ్తారని పీఆర్‌ఓ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆస్తి పన్ను వసూలు 74శాతమే!

- మార్చి 31తో ముగియనున్న ఆర్థిక సంవత్సరం
- గ్రామ పంచాయతీల్లో పన్నువసూలు లక్ష్యం రూ.11.59 కోట్లు
- ఇప్పటి వరకు వసూలైంది రూ.8.58 కోట్లు



పన్నుల వసూలు డిమాండ్ (రూపాయల్లో..)

ఈ ఏడాది పన్ను	11,01,55,514
గతేడాది బకాయిలు	57,73,797
వసూలు లక్ష్యం	11,59,29,311
నేటివరకు వసూలైంది	8,58,96,235
మిగిలిన బకాయి	3,00,33,076

దురాజ్‌పల్లి (సూర్యాపేట): గ్రామపంచాయతీల్లో ఆస్తి పన్నుల వసూలు సవాలుగా మారింది. ఖజానా ఖాళీ అయి కార్మికులకు వేతనాలు, కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించలేని స్థితిలో ఉన్న గ్రామాలకు పంచాయతీల్లో వసూలు చేసే పన్నులే పెద్దదిక్కు. 2023– 24 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామ పంచాయతీల్లో ఆస్తిపన్ను వసూలుకు మరో 37 రోజుల సమయం మిగిలిఉంది. కానీ ఇప్పటి వరకు జిల్లాలో 74.02 శాతం పన్నులు మాత్రమే వసూలయ్యాయి. గడువులోగా మిగిలిన 29.29 శాతం పన్ను వసూలుకు అధికారులు ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉంది.

గతేడాది బకాయిలు రూ.57.73లక్షలు

2022– 23 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 475 పంచాయతీల్లో రూ.11.01కోట్ల పన్ను వసూలు లక్ష్యంగా పెట్టుకున్నారు. గతేడాది బకాయిలు రూ.57.73లక్షలు ఉండగా మొత్తం రూ.11.59 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు రూ.8.58 కోట్లు వసూలు చేసినట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. నేటికీ కేవలం 74.02శాతం పన్నులు మాత్రమే వసూలు చేయగా రానున్న 37 రోజుల్లో రూ.3,00,33,076 పన్ను వసూలు చేయాల్సి ఉంది.

అత్యధికంగా చింతలపాలెం మండలంలో వసూలు

కొద్దిరోజుల క్రితం వరకు ఇంటి పన్నుల వసూలులో జిల్లా పూర్తిగా వెనుకబడి ఉంది. దీంతో రంగంలోకి దిగిన కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్ ప్రియాంక పన్ను వసూలులో వెనుకబాటుకు కారణాలను తెలుసుకొని ప్రధానంగా పరిశ్రమల నుంచి రావాల్సిన పన్నులు వసూలు కాలేదని గుర్తించారు. నాటి నుంచి వాటిని రాబట్టడంతో జిల్లాలో పన్నుల వసూలు కాస్త పెరిగింది. ఇక వంద శాతం పన్ను వసూలు దిశగా దృష్టి సారించి కార్యదర్శులను అప్రమత్తం చేస్తున్నారు. జిల్లాలో చింతలపాలెం మండలంలో అత్యధికంగా 89 శాతం పన్నులు వసూలు కాగా.. హుజూర్‌నగర్‌లో 83 శాతం, చివ్వెంలలో 79 శాతం, సూర్యాపేటలో 78 శాతం పన్నులు వసూలయ్యాయి. అత్యల్పంగా నేరేడుచర్ల మండలంలో 65 శాతం, నూతనకల్‌లో 68 శాతం, మోతె మండలంలో 69 శాతం మాత్రమే పన్నులు వసూలు జరిగింది.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఐఈఓ కృష్ణయ్య

సూర్యాపేట టౌన్: ఈనెల 28వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి (డీఐఈఓ) జానపాటి కృష్ణయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఐఈఓ కార్యాలయంలో సీఎస్‌లు, డీఓలు, కస్టోడియన్లు, స్క్వాడ్‌లతో నిర్వహించిన ఓరియెంటేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. జిల్లాలో 16,602 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. అనంతరం డీఈసీ మెంబర్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఒకేషనల్ విద్యార్థులకు సులభంగా పాసయ్యేందుకు తయారు చేసిన(ఈజీటు పాస్) మెటీరియల్‌ను డీఐఈఓ కృష్ణయ్య, డీఈసీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈసీ సభ్యులు రుద్రంగి రవి, జి.లక్ష్మయ్య, ప్రిన్సిపాళ్లు రాకెండ్‌కుమార్, పెరుమాళ్ల యాదయ్య, ప్రభాకర్‌రెడ్డి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఊంజలి సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం ఊంజలి సేవ కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. అమ్మవారిక సేవకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారి సేవను అధిష్టించి ఊంజలి సేవ నిర్వహించారు. అలాగే ప్రధానాలయంలో సుప్రభాత సేవ, అభిషేకం, అర్చనలు, సుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం తదితర కైంకర్యాలు గావించారు.



అమ్మవారి సేవను ఆలయ తిరువీధిలో ఊరేగిస్తున్న ఆచార్యులు

● అప్పుడు సేఫ్..



ఈ నెల 13న నల్లగొండలో బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించిన సభావేదికపై కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత (రెడ్ శారీ)

– నల్లగొండ రూరల్

సభకు హాజరై తిరిగి వెళ్తున్న సమయంలో చర్లపల్లి వద్ద లాస్యనందిత కారు ప్రమాదానికి గురికాగా.. ఆమెకు ఏమీకాలేదు. ముందు భాగం దెబ్బతిన్న కారు నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉంది.



విదేశీ విద్యా స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలోని అల్పసంఖ్యాకవర్గాల విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా అందించే స్కాలర్‌షిప్‌నకు మార్చి 30 నాటికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కె.జగదీశ్వర్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షలలోపు ఉండాలని, వయస్సు 35 సంవత్సరాలు మించని అభ్యర్థులు telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ లేదా జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధికారి కార్యాలయం సూర్యాపేట ఫోన్ : 9247720650, 9492611057 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రేపు కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

హుజూర్‌నగర్: మేళ్లచెరువు మండలం కందిబండలో ఆదివారం కబడ్డీ జిల్లా సీనియర్ పురుషుల జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్టు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బెల్లంకొండ రామచందర్‌గౌడ్, నామ నరసింహారావు తెలిపారు. శుక్రవారం వారు హుజూర్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడారు. సెలక్షన్ మ్యాట్‌పై నిర్వహిస్తున్నందు క్రీడాకారులు తప్పనిసరిగా మ్యాట్ షూతో హాజరుకావాలని పేర్కొన్నారు. క్రీడాకారులు 85కేజీల లోపు బరువు ఉండాలని, తమ వెంట ఆధార్ కార్డ్ తీసుకొనిరావాలని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్‌లో మార్చి 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించే 70వ అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

నేడు హైకోర్టు చీఫ్ జస్టిస్ రాక



కోదాడ కోర్టు ఆవరణలో సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా ప్రధాన జడ్జి రాజగోపాల్

- కోదాడ, సూర్యాపేటలో కోర్టు భవనాలను ప్రారంభించనున్న జస్టిస్ అలోక్ అరాధే
- ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా జడ్జి రాజగోపాల్

కోదాడ అర్బన్, చివ్వెంల(సూర్యాపేట): కోదాడలో రెండు అదనపు కోర్టుల ప్రారంభోత్సవంతో పాటు కోర్టు పునర్నిర్మాణ శంకుస్థాపనకు శనివారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే వస్తున్న నేపథ్యంలో శుక్రవారం జిల్లా జడ్జి రాజగోపాల్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ కార్యవర్గం, సీనియర్ న్యాయవాదులతో కలిపి ఆయన కోర్టు ప్రాంగణాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కాగా ఈ కార్యక్రమానికి హైకోర్టు సీజేతో పాటు మరో నలుగురు హైకోర్టు న్యాయమూర్తులైన జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ బి.విజయ్‌సేనారెడ్డి, జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ టి.వినోద్‌కుమార్‌లు హాజరవుతున్నారని జడ్జి తెలిపారు. కోదాడలో కార్యక్రమాలు పూర్తయిన అనంతరం చీఫ్ జస్టిస్‌తోపాటు ఇతర న్యాయమూరుతులు సూర్యాపేటకు వచ్చి జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అదనపు సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ జూనియర్ కోర్టు అదనపు ప్రిన్సిపల్ జడ్జి భవ్య, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగార్జున, శరత్‌బాబు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నేటి నుంచి టీసీసీ పరీక్షలు



సూర్యాపేట బాలికల ఉన్నత పాఠశాలలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

సూర్యాపేట టౌన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ పరీక్షలు శనివారం నుంచి ఈ నెల 27వరకు జరగనున్నట్టు డీఈఓ కె.అశోక్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు రెండు విడతలుగా ఈ పరీక్షలు జరగనున్నాయని పేర్కొన్నారు. టైలరింగ్‌కు పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు వారి వెంట కుట్టు మిషన్ తెచ్చుకోవాలని, పరీక్షకు గంట ముందే హాజరు కావాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని నాలుగు సెంటర్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. జిల్లా కేంద్రంలోని నంబర్–2 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ (లోయర్), ఎంఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో(డ్రాయింగ్ లోయర్), ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో(డ్రాయింగ్ హయ్యర్), జెడ్పీ బాలుర పాఠశాలలో టైలరింగ్, ఎంబ్రాయిడరీ(లోయర్, హయ్యర్) పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో ఇప్పటికే అభ్యర్థుల హాల్ టికెట్ నంబర్లు వేసినట్టు పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సం చేపట్టారు. అనంతరం కల్యాణం జరిపారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు లక్ష్మణా చార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

క్యాంపస్ అంబాసిడర్స్‌కు శిక్షణ



క్యాంపస్ అంబాసిడర్స్‌కు నిర్వహించిన శిక్షణలో మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ రమేష్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఓటు హక్కు, ఓటింగ్ యాంత్రాలపై అవగాహన కల్పించేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వివిధ కళాశాలల నుంచి క్యాంపస్ అంబాసిడర్స్‌గా ఎంపిక చేసిన విద్యార్థులకు శుక్రవారం కలెక్టరేట్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా స్వీప్ నోడల్ అధికారి కె.అశోక్ మాట్లాడుతూ విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించామన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ రమేష్, పబ్బతి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రైనింగ్ నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఎన్నికలన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, డీఐఈఓ కృష్ణయ్య, ప్రతాప్, సీనయ్య తదితరులు పాల్గొన్నారు.

మోడల్ కోడ్‌పై అవగాహన కలిగి ఉండాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో త్వరలో రానున్న మోడల్ కోడ్‌పై జిల్లాలోని మీడియా ప్రతినిధులు పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర స్థాయి మాస్టర్ ట్రైనర్స్ వి.రమేష్, పి.వెంకటేశ్వర్లు, సీహెచ్.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ)పై ప్రింట్ అండ్ ఎలాక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సంఘాలకు యూనిఫామ్ కుట్టే బాధ్యత

- స్వశక్తి మహిళలకు ఇచ్చేందుకు నిర్ణయం
- కుట్టుపని వచ్చే 1,685 మంది గుర్తింపు
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు



సమావేశంలో స్వయంసహాయక సంఘాల మహిళలు (ఫైల్)

హుజూర్‌నగర్: ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల యూనిఫామ్ కుట్టే పనిని మహిళా స్వయం సహాయక బృందాలకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా మహిళలకు ఉపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయాలని భావిస్తోంది. దీనికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లాకు చెందిన సంబంధిత అధికారులు ప్రతిపాదనలతోపాటు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

దుస్తులు కుట్టేందుకు ఆసక్తి గలవారి గుర్తింపు

జిల్లాలో మండల సమాఖ్యలు 23 ఉండగా గ్రామైక్య సంఘాలు 579, స్వయం సహాయక సంఘాలు 17,457 ఉన్నాయి. అన్ని సంఘాల్లో కలిపి 1,81,476 మంది సభ్యులు ఉన్నారు. ఆయా సంఘాల్లో యూనిఫామ్ కుట్టేందుకు ఆసక్తి గల మహిళలను గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు గుర్తించే పనిలో పడ్డారు. ఇప్పటికే సెర్ప్ సీఈఓ కూడా తమ సిబ్బందికి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి క్లస్టర్ల వారీగా ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. కుట్టు మిషన్ ఉండి దుస్తులు కుట్టడం వచ్చిన వారితోపాటు నేర్చుకుని కుట్టేందుకు ఆసక్తి గల మహిళల వివరాలు నమోదు చేసుకుంటున్నారు. దీనికి అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అందించాలని..

జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కస్తూరిబా గాంధీ, ఆదర్శ పాఠశాలలతో పాటు గురుకులాల్లో చదివివారితో కలిపి ప్రస్తుతం 81,973 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి యూనిఫామ్ కుట్టించి అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా దుస్తులు కుట్టేందుకు ఆసక్తి ఉన్న దాదాపు 1,685 మంది మహిళలను గుర్తించారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కుట్టు పని ప్రారంభిస్తాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వశక్తి మహిళల్లో దుస్తులు కుట్టేందుకు ఆసక్తిగల వారిని గుర్తించాం. వారితో యూనిఫామ్ కుట్టించేందుకు సన్నద్ధం చేస్తున్నాం. వారికి అవసరమైన శిక్షణ ఇప్పిస్తాం. విద్యాశాఖ సౌజన్యంతో వస్త్రం తెప్పించి ప్రభుత్వ ఆదేశాలు రాగానే కుట్టు పనిని ప్రారంభిస్తాం.

– జి.మధుసూదనరాజు, డీఆర్‌డీఓ, సూర్యాపేట

వనదేవతలకు మొక్కులు



రాజాపేట : చిన్నమేడారం జాతరకు హాజరైన భక్తులు

- వైభవంగా కొనసాగుతున్న చిన్న మేడారం జాతర

రాజాపేట: మండలంలోని చిన్నమేడారం, చల్లూరు యాదాద్రి మేడారాల్లో కొలువుదీరిన వనదేవతలకు శుక్రవారం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఎల్లమ్మ బోనాలతో ప్రారభమైన సమ్మక్క సారలమ్మ జాతరకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా పరిసర వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అమ్మవార్లకు వడిబియ్యాలు, గాజులు, పసుపు, కుంకుమ, వస్త్రాలు, తలనీలాలు సమర్పించుకున్నారు. నిలువెత్తు బంగారం (బెల్లం) తూకంవేసి అమ్మవారికి నైవేద్యంగా అర్పించారు. గద్దెల చుట్టూ ప్రదక్షిణలు చేసి వరం పట్టి ముడుపులు చెల్లించుకున్నారు. కాగా.. శనివారం సమ్మక్క-సారలమ్మ దేవతల వన ప్రవేశం నిర్వహించడంతో జాతర ముగియనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గద్దెకు చేరిన పగిడిద్దరాజు

పెద్దవూర: మండలంలోని పొట్టిచల్మ ఎక్స్‌రోడ్డు వద్ద కృష్ణా నది సమీపంలో చిన్న మేడారం వద్ద సమ్మక్క-సారలమ్మ జాతర మూడోరోజు కొనసాగింది. శుక్రవారం వేకువజామున ప్రధాన పూజారులు డప్పు వాయిద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి పగిడిద్దరాజును గద్దెకు చేర్చారు. సమీప గ్రామాల ప్రజలు వనదేవతలను దర్శించుకుని నిలువెత్తు బంగారం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారులు, ధర్మకర్తలు గుంజ అంజమ్మ, గుంజ కృష్ణంరాజు, నాగపురి లక్ష్మి పాల్గొన్నారు.



వన దేవతలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పోటెత్తిన భక్తజనం

పెన్‌పహాడ్: మండల పరిధిలోని గాజులమల్కాపురం గ్రామంలో శ్రీసమక్క-సారలమ్మ జాతర శుక్రవారం మూడో రోజు వైభవంగా కొనసాగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తమ మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి బంగారం (బెల్లం) సమర్పించారు. నాగుపాము పుట్ట వద్ద భక్తులు పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ నాతాల వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ బండి ధనమ్మరామకృష్ణారెడ్డి, బండి మధుసూదన్‌రెడ్డి, మామిడి వెంకన్న, వాంకుడోతు జ్యోతి, కుందూరు ప్రభాకర్‌రెడ్డి, బెల్లంకొండ శ్రీరాములు, కుందూరు వెంకట్‌రెడ్డి, దొంతగాని గోపయ్య, బచ్చలకూరి రామచంద్రు, మండాది పాపయ్య, భేగం జాన్‌షా, బచ్చలకూరి జానయ్య దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. కాగా.. ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి కోలాటం, డ్యాన్స్‌బేబీ డ్యాన్స్ పోటీలు కొనసాగుతున్నాయి.



కోలాటం వేస్తున్న మహిళలు

దివ్యవిమాన రథంపై నారసింహుడు



గరుడ వాహనసేవను ఊరేగిస్తున్న ఆలయ అర్చకులు, పాల్గొన్న ఈఓ రామకృష్ణారావు, అధికారులు

- పూర్వగిరిలో వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు
- గరుడ వాహనంపై ఊరేగిన శ్రీస్వామి వారు

యాదగిరిగుట్ట: శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం శ్రీస్వామి వారు గరుడ వాహనంపై ఊరేగారు. రాత్రి దివ్యవిమాన రథంపై తిరువీధుల్లో విహరించారు. ఆలయంలో నిత్య ఆరాధనల అనంతరం ఆలయ ప్రధానార్చకులు, యాజ్ఞాచార్యులు, అర్చక బృందం, వేదపండితులు, పారాయణీకులు చతుర్వేద పారాయణములు, నిత్య హవనం, మూలమంత్ర, మూర్తి మంత్ర జపములు, లక్ష్మీ అష్టోత్తర నామ జపములు నిర్వహించారు. కల్యాణ మూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి, గరుడ వాహన సేవలో తిరువీధిలో ఊరేగించారు. ఇక సాయంత్రం రథాంగ హోమం, రథబలి వేడుకలను ఆగమ శాస్త్రానుసారంగా జరిపించారు. రథంపై శ్రీస్వామి అమ్మవార్లను అధిష్టింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం, సాయంత్రం జరిగిన వేడుకల్లో ఈఓ రామకృష్ణరావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, అర్చక బృందం పాల్గొన్నారు.



గరుడ వాహనంపై శ్రీస్వామి అమ్మవార్ల కల్యాణ మూర్తులు

పెద్దఎత్తున పాల్గొన్న భక్తులు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రథోత్సవంలో యువత, భక్తులు అధికంగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో పాతగుట్టతో పాటు యాదగిరిగుట్ట మండలంలోని చుట్టుపక్కల ఉన్న యువకులు, మహిళలు, యువతులు, భక్తులు పాల్గొని నృత్యాలు చేస్తుండగా శ్రీస్వామి అమ్మవార్లు ఉన్న రథం ముందుకు సాగింది. రథోత్సవం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

సాంస్కృతిక కార్యక్రమాలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మల్లాపురానికి చెందిన శ్రీరామభక్త భజన మండలి, యాదగిరిగుట్టకు చెందిన శ్రీగాయత్రి మహిళ భజన మండలిచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఇక హైదరాబాద్‌కు చెందిన డీఎస్ శ్రీదేవి భక్తి సంగీతం నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక విశ్వకళా మండలి రాంపల్లి వారిచే నృత్య ప్రదర్శన జరిగింది.

నేడు చక్రతీర్థం

వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఆలయంలో ఉదయం 9గంటలకు పూర్ణాహుతి, మధ్యాహ్నం 12గంటలకు చక్రతీర్థం, సాయంత్రం 5గంటలకు దేవతోద్వాసన, శ్రీపుష్పయాగం, డోలారోహణం నిర్వహించనున్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

దారితప్పి జనారణ్యంలోకి..

- అర్బన్ పార్కులో ఇటీవల 45జింకలను వదిలిన అధికారులు
- కంచె దాటుకుని బయటకు వస్తుండడంతో వాటిని వేటాడుతున్న వీధి కుక్కలు
- ఇప్పటికే రెండు జింకలు మృతి
- శుక్రవారం ఫైలాన్‌కాలనీలో పరుగులు పెట్టిన జింక

నాగార్జునసాగర్: అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో భాగమైన నాగార్జునసాగర్ కోర్ ఏరియాలో అడవిలో వదిలిన జింకలు జనారణ్యంలోకి వచ్చి వీధికుక్కల బారిన పడుతున్నాయి. సాగర్ తీరంలో నాగార్జునసాగర్-హైదరాబాద్ నల్లగొండ రహదారి వెంట ఏర్పాటు చేసిన అర్బన్ పార్కులో ఇటీవల సుమారుగా 45జింకలను వదిలారు. కేవలం రోడ్డు వెంట, పక్కన గల చేల వైపు మాత్రమే ముళ్ల కంచె వేశారు. వెనుక వైపు కేవలం కట్టెలు, కంపతో కంచె ఏర్పాటు చేశారు. దీంతో జింకలు వెనక వైపు నుంచి కంచెను దూకి బయటకు వెళ్తున్నాయి. ఈ నెల 8న, 22న దారితప్పిన జింకలను వీధికుక్కలు వెంటాడి చంపివేశాయి. ఇదిలా ఉండగా.. మరో జింక శుక్రవారం ఉదయం నందికొండ మున్సిపాలిటీలోని ఫైలాన్‌కాలనీలో వీధుల వెంట పరుగులు పెట్టింది. యువకులు దానిని పట్టుకునేందుకు ప్రయత్నించగా.. ఒకరి ఇంట్లో దూరింది. ఫారెస్ట్ అధికారులకు ఫోన్‌చేయడంతో వారు వచ్చి తీసుకువెళ్లారు.



ఇంట్లో దూరిన జింకను పట్టుకుంటున్న యువకులు

మిగిలిన జింకలన్నీ పదిలమేనా..

సుమారుగా 45 జింకలను అడవిలో వదలగా రెండు జింకలు జనారణ్యంలోకి వచ్చి ప్రాణాలు పోగొట్టుకున్నాయి. మిగిలిన జింకలు పదిలంగా ఉన్నట్టా లేదా పక్కనగల గ్రామాల్లోకి వెళ్లినట్టా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. జింకలను కాపాడేందుకు ఫారెస్ట్ అధికారులు గత రెండు రోజులుగా అటవీ ప్రాంతం వెంటగల తండాలు, గ్రామాలకు వెళ్లి ఎక్కడైన జింకలు కనపడితే అటవీ అధికారులకు ఫోన్లు చేయాలని, వాటిని తాము వచ్చేంతవరకు కాపాడాలని మైకులో చెప్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహిళా రైతు ఆత్మహత్యాయత్నం



పెట్రోల్ మీద పోసుకొని ఆందోళన చేస్తున్న మహిళా రైతు

గుండాల : వ్యవసాయ భూమి తనకు దక్కకుండా పోతుందని ఆందోళన చెందిన మహిళా రైతు తహసీల్దార్ కార్యాలయం వద్ద పెట్రోల్ మీద పోసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం కొమ్మాయిపల్లి గ్రామానికి చెందిన కాటబోయిన వెంకటయ్యకు ముగ్గురు కూతుళ్లు ఉండగా.. వారందరి పెళ్లిల్లు అయ్యాయి. రెండో కూతురు రామక్క తన భర్తతో కలిసి పెళ్లి అయినప్పటి నుంచి వెంకటయ్య వద్దే ఉంటున్నది. చిన్న కూతురు మరణించగా పెద్ద కూతురు సోమక్క తన భర్తతో గొడవలు జరిగి.. ఆమె కూడా తండ్రి వెంకటయ్య వద్ద ఉంటున్నది. అయితే, వెంకటయ్య పేరు మీద ఉన్న 11 ఎకరాల భూమిని పెద్ద కూతురు సోమక్క తన పేరు మీద పట్టా చేయించుకుంది. ఆ తర్వాత అందులో నుంచి ఏడు ఎకరాల భూమిని చెల్లులు రామక్క కుమారుడైన సంగి స్వామికి పట్టా చేశారు. మిగతా 4 ఎకరాల భూమిని వెంకటయ్య మూడో కూతరు లక్ష్మమ్మ మనమరాలైన అశ్వినికి ఇచ్చేందుకు ఇటీవల ఒప్పందం కుదిరింది. అశ్విని ఆ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకునేందుకు సిద్ధమైంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు శనివారం రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు స్లాట్ బుక్ చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సంగి స్వామి భార్య సంగి సుమలత (రామక్క కోడలు) ఆ భూమి తమకే కావాలంటూ తన భర్తపై రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ తహసిల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం పెట్రోల్ మీద పోసుకొని ఆత్మహత్యా యత్నం చేసుంది. ఇది గమనించిన రెవెన్యూ సిబ్బంది కార్యాలయంలో ఉన్న ఇతర వ్యక్తులు వారిని వారించి పెట్రోల్ డబ్బాను తీసేసుకున్నారు.

వివరాలు తెలుసుకుని పరిష్కరిస్తాం..

మహిళా రైతు ఆందోళన మేరకు రిజిస్ట్రేషన్‌ను నిలుపుదల చేసినట్లు తహసీల్దార్ జలకుమారి తెలిపారు. గ్రామానికి వెళ్లి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వివరాలు తెలుసుకొని పరిష్కరిస్తామని తెలిపారు.

యువతి అదృశ్యం

నడిగూడెం: అనంతగిరి మండలం త్రిపురవరం గ్రామంలో ఈ నెల 21న యువతి అదృశ్యమైంది. ఎస్‌ఐ అజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. త్రిపురవరం గ్రామానికి చెందిన మాదాసు ఉపేందర్ రెండో కుమార్తె మమత ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో మమత కుటుంబ సభ్యులు బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. మమత తండ్రి ఉపేందర్ శుక్రవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అజయ్ కుమార్ తెలిపారు.

ఉరేసుకుని మహిళ బలవన్మరణం

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని చైతన్యనగర్‌లో శుక్రవారం మహిళ ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం మంగలదుబ్బతండాకు చెందిన కొర్ర ధనలక్ష్మి(29) గత మూడేళ్లుగా తన భర్త లక్ష్మణ్‌కు దూరంగా ఉంటుంది. పట్టణంలోని చైతన్యగనగర్‌లో గల తన అక్క, బావ విదేశాల్లో ఉంటుండగా వారి పిల్లలను చూసుకుంటూ వారింట్లోనే తన తొమ్మిదేళ్ల కుమారుడితో కలిసి ఉంటుంది. ఈ క్రమంలో శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే.. ఆమె మృతికి దామరచర్ల మండలం మొదుగులదండాకు చెందిన మహేష్ అనే వ్యక్తి కారణమని ధనలక్ష్మి తమ్ముడు ధీరావత్ దామోదర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిందితుడిపై ఫోక్సో కేసు

వలిగొండ : బాలికను కిడ్నాప్ చేసిన ఘటనలో నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడిని శుక్రవారం చౌటుప్పల్ జడ్జి ఎదుట హాజరు పరచగా అతడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ మహేందర్ లాల్ తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలోని ఆరూరుకు చెందిన బండారు రాజు అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను కిడ్నాప్ చేశాడని బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కిడ్నాప్ కేసులో తప్పించుకుని తిరుగుతున్న నిందితుడు బండారు రాజును జనగాం జిల్లాలోని ఎర్రగొల్లపాడు గ్రామంలో పోలీసులు అరెస్టు చేసి చౌటుప్పల్ కోర్టులో హాజరు పరిచారు. దీంతో జడ్జి ఆదేశాల మేరకు నిందితుడిపై ఫోక్సోచట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

గంజాయి విక్రయించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

రామగిరి(నల్లగొండ): గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన కేసులో వ్యక్తికి మూడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ మొదటి అదనపు కోర్టు జడ్జి బి.తిరుపతి శుక్రవారం తీర్పు వెలువరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా పెద్దపురానికి చెందిన నందం సురేష్ గంజాయి విక్రయించడం వృత్తిగా ఎంచుకున్నాడు. 2022 ఏప్రిల్ 21న నల్లగొండలోని మిర్యాలగూడ రోడ్డులో ఓ పెట్రోల్ బంకు వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. అప్పటి సీఐ వి.వెంకటేశ్వర్‌రెడ్డి సిబ్బందితో కలిసి పెట్రోల్ బంకు వద్ద అనుమానాస్పదంగా ఉన్న సురేష్ అదుపులోకి తీసుకోగా అతని వద్ద 1.9 కిలోల గంజాయి పట్టుపడింది. వెంటనే అతడిని అదుపులోకి తీసుకొని రిమాండ్ చేసి కోర్టుకు తరలించారు. ఎస్సై రోజ చార్జ్‌షీట్ నమోదు చేసి విచారణ చేయగా నల్లగొండ చుట్టు పక్కల ఉన్న యువతను లక్ష్యంగా ఎంచుకుని గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిసింది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరిగిరి వెంకట్‌రెడ్డి వాదనలతో ఏకీభవించిన మొదటి అదనపు కోర్టు జడ్జి బి.తిరుపతి నిందితుడికి 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

యువకుడు ఆత్మహత్య

రామగిరి(నల్లగొండ): అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన తిప్పర్తిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని గడ్డికొండారం గ్రామానికి చెందిన కస్పరాజు నవీన్(27) తిప్పర్తి మిషన్ భగీరథ పంప్‌హౌస్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మూడు సంవత్సరాల క్రితం కాజీరామారం గ్రామానికి చెందిన శివానితో వివాహమైంది. నవీన్ తనకున్న 5 ఎకరాల భూమితోపాటు మరో ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. అప్పుచేసి పెట్టుబడి పెట్టాడు. ఈసారి బోర్లు సరిగా పోయకపోవడంతో వేసిన పంట అంతా ఎండిపోయింది. దీంతో మనస్తాపం చెందిన నవీన్ శుక్రవారం ఇంటి నుంచి డ్యూటీకి వెళ్లి తిప్పర్తి పంప్‌హౌస్ వద్ద మెట్లకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఆరు నెలల కుమారుడు ఉన్నాడు. అతడి తండ్రి సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

యూనివర్సిటీలో కరపత్రాల కలకలం

- 'నిరుద్యోగ విద్యార్థి రాడికల్స్' పేరిట కరపత్రాలు

నల్లగొండ రూరల్ (ఎంజీ యూనివర్సిటీ): మహాత్మా గాంధీ యూనివర్సిటీలో శుక్రవారం 'నిరుద్యోగ విద్యార్థి రాడికల్స్' పేరిట వెలిసిన కరపత్రాలు కలకలం రేపాయి. 'అవినీతి సొమ్ముతో రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారావని.. యూనివర్సిటీలో చీకటి వ్యాపారానికి తెరలేపావని' యూనివర్సిటీ వీసీని దూషిస్తూ కరపత్రంలో పేర్కొన్నారు. అవినీతి అధికారులంతా తప్పు ఒప్పుకుని విధుల నుంచి వైదొలగాలని హెచ్చరించారు. 31 మంది అవినీతి మార్గంలో ఉద్యోగాలు పొందారని అందులో పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రాణాలకు తెగించి తెలంగాణ కోసం బలైన నిరుద్యోగులు గుర్తుకు రాలేదా.. అని మాజీ మంత్రి పేరును కూడా కరపత్రంలో ప్రస్తావించారు.

నిరాధారమైన ఆరోపణలు: ఎంజీయూ వీసీ

కరపత్రాల్లో ఉన్న అంశాలన్నీ పూర్తిగా నిరాధారమైనవని ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. తనకు రియల్ ఎస్టేట్‌లో వ్యాపారాలు లేవని, యూనివర్సిటీలో ఎలాంటి అవినీతి జరగలేదని, సమస్యలు ఉంటే తనను అడగవచ్చని తెలిపారు.

గ్రామంలో సంచరిస్తున్న మహిళల బైండోవర్

యాదగిరిగుట్ట రూరల్ : గ్రామంలో పలువురు మహిళలు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా వారిని అదుపులోకి తీసుకుని బైండోవర్ చేశారు. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలంలోని దాతర్‌పల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. యాదగిరిగుట్ట సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. దాతర్‌పల్లి గ్రామంలో ఐదుగురు మహిళలు కండెల జ్యోతి, జగన్నాథం నాగమ్మ, పోలే యశోద, జగన్నాథం జ్యోతి, జగన్నాథం నాగమ్మ కలిసి డబ్బులు వడ్డీలకు ఇస్తామని చెప్పి గ్రామంలో తిరుగుతున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులు పిల్లలను ఎత్తుకెళ్లేవారేమోనని అనుమానంతో మండల పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ సమాచారంతోవెంటనే పోలీసులు గ్రామానికి చేరుకుని మహిళలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా వారు గజ్వేల్ పట్టణానికి చెందిన వారని తేలింది. తక్కువ డబ్బులను అధిక వడ్డీలకు ఇస్తుంటారని, ఆ క్రమంలోని డబ్బులు వడ్డీలకు ఇవ్వడానికి దాతర్‌పల్లి గ్రామానికి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. వారిని స్థానిక తహసీల్దార్ ఎదుట 109 సీఆర్‌పీసీ కింద బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.



యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయంలో మహిళలను బైండోవర్ చేస్తున్న పోలీసులు

25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నార్కట్‌పల్లి: పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ చేసిన వ్యక్తిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ధనలక్ష్మి రైస్ మిల్ ఎదురుగా గల రేకుల షటర్‌లో పీడీఎస్ బియ్యం నిల్వ చేసినట్లు సమాచారం రావడంతో నార్కట్‌పల్లి పోలీసులు, ప్రత్యేక పోలీసు బృందం అక్కడకు వెళ్లి తనిఖీ చేశారు. ఈసందర్భంగా పట్టణానికి చెందిన దోసపాటి వేణు అక్రమంగా నిల్వ చేసిన సుమారు 22 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించారు. వేణుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

నేడు వజ్రతేజ రైస్ మిల్లులో చిరంజీవి సినిమా షూటింగ్

హాలియా: ప్రముఖ తెలుగు చలనచిత్ర నటుడు, మెగాస్టార్ చిరంజీవి నటించనున్న విశ్వంబర సినిమా షూటింగ్‌ను శనివారం హాలియా పట్టణంలోని వజ్రతేజ రైస్ మిల్లులో నిర్వహించనున్నారు. ఈమేరకు చిత్ర యూనిట్ ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే వారు షూటింగ్‌కు సంబంధించి మిల్లు యాజమాన్యం అనుమతి తీసుకున్నారు. యూవీ క్రియేషన్ బ్యానర్‌పై నిర్మించనున్న ఈ సినిమాలో చిరంజీవి, రాజా రవీంద్ర, హర్షవర్ధన్, వెన్నెల కిశోర్, చమ్మక్ చంద్ర, ప్రవీన్, రోహన్, అకుల్, కుసుం, ప్రత్యూష సింగంశెట్టి, నాగరాజు, రాహుల్‌లపై సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. మిల్లులోని 10 ధాన్యం లోడ్లతో ఉన్న ట్రాక్టర్లు, మిల్లు ఆవరణలో సన్నివేశాలు తీయనున్నట్లు సమాచారం. ఉదయం 9 గంటల నుంచి రాత్రి వరకు సినిమా షూటింగ్ నిర్వహించనున్నారు. చిరంజీవి సినిమా షూటింగ్ కావడంతో అభిమానులు పెద్దఎత్తున వచ్చే అవకాశం ఉన్నందున మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, హాలియా సీఐ రాఘవరావు భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు.